శనివారం కామారెడ్డి ఆర్టీసీ బస్ డిపో ఎదుట విద్యార్థుల ధర్నా

విద్యార్థులకు ప్రత్యేక బస్సులు నడపాలి

- 'మహాలక్ష్మి' వచ్చాక బస్సుల సంఖ్యను తగ్గించారు
- ఆర్టీసీ అధికారులపై ఏబీవీపీ నాయకుల ఆగ్రహం
- కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా

కామారెడ్డి, డిసెంబర్ 30: విద్యార్థుల కోసం బస్సులు నడపాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో కామారెడ్డి ఆర్టీసీ డిపో ఎదుట శనివారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తీసుకువచ్చి బస్సుల సంఖ్యను తగ్గించిందని విమర్శించారు. సమయానుకూలంగా బస్సులు నడపకపోవడంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం కామారెడ్డిలో జరిగిన ఓ పరీక్షకు 20 మంది విద్యార్థులు చేరుకోలేకపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. పాఠశాలలు, కళాశాలల వేళలకు అనుకూలంగా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. డిపో మేనేజర్ ఇందిర అక్కడికి చేరుకొని విద్యార్థులను సముదాయించారు. కాగా బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోనూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు.

పత్తి రైతుకు పుట్టెడు కష్టాలు

- ప్రభుత్వ మద్దతు ధర రూ. 7,020
- సీసీఐ ఇస్తున్నది రూ.6,900 ..
- రూ.6,500 మాత్రమే ఇస్తున్న ప్రైవేటు వ్యాపారులు
- సాకులు చెబుతూ ధరలో కోతలు
- నిరుడు రూ.14 వేలు పలికిన క్వింటాలు పత్తి
- మద్దతు ధరను రూ. 10 వేలకు పెంచాలని డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ): నిరుడు రికార్డుస్థాయి ధర పలికిన పత్తికి ఈసారి మాత్రం మద్దతు ధర కూడా లభించకపోవడంతో రైతులు ఆందోళనలో మునిగిపోయారు. పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ. 7,020గా ఉండగా, ప్రైవేటు వ్యాపారులు రూ.6,500 చెల్లిస్తున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా మద్దతు ధరకు రూ.100 తక్కువగా రూ.6,900 చెల్లిస్తున్నది. నాణ్యత లేదని, పొడవు తగ్గిందని పలు రకాల సాకులు చెప్తూ మద్దతు ధరలో కోతపెడుతున్నారు. ఇది పత్తి రైతును కలవరపెడుతున్నది. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 45 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. 30 లక్షల బేళ్ల పత్తి కొనుగోలుకు మార్కెటింగ్‌శాఖ ప్రణాళికలు రూపొందించింది. అయినప్పటికీ ఇప్పటి వరకు సీసీఐ, ప్రైవేటు వ్యాపారులు కలిపి కొన్నది 13 లక్షల బేళ్లు మాత్రమే. ప్రైవేటు వ్యాపారులు 7 లక్షల బేళ్ల పత్తిని కొనుగోలు చేస్తే, సీసీఐ 6 లక్షల బేళ్లతో సరిపెట్టింది. సీజన్ ప్రారంభంలో తొలుత క్వింటాలు పత్తికి రూ. 7,500 వరకు ధర పలికి ఊరించింది. ఆ తర్వాత క్రమంగా పడిపోయింది.

నిరుడు రూ. 14 వేలు

నిరుడు ఒకానొక దశలో క్వింటాలు పత్తికి రూ. 14 వేలు పలికి రికార్డు సృష్టించింది. ఆ తర్వాత తగ్గినప్పటికీ సగటున రూ. 10 వేలు పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈసారి మాత్రం ధరలు దారుణంగా పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎకరా పత్తి సాగుకు సగటున రూ. 30 నుంచి రూ.32 వేలు ఖర్చవుతుంది. ఎకరాకు 3-4 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ లెక్కన రైతుకు లభించేది గరిష్ఠంగా రూ.28 వేలు మాత్రమే. అంటే ఎకరాకు నాలుగైదు వేలు నష్టపోతున్నారు. నష్టాల నేపథ్యంలో మద్దతు ధరను రూ. 10 వేలుగా ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిరుడు 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, ఈసారి 5 లక్షల ఎకరాలు తగ్గి 45 లక్షలకే పరిమితమైంది. దీనికితోడు ఈ సీజన్‌లో వర్షాలు ఆలస్యం కావడం కూడా పత్తిసాగు, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిందని రైతులు చెప్తున్నారు.

చట్టం ప్రకారమే కేసుల దర్యాప్తు: హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 30, (నమస్తే తెలంగాణ): బోధన్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్‌పై పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన రోడ్డు ప్రమాద కేసులో సీఆర్పీసీ చట్టం ప్రకారం నడుచుకోవాలని హైకోర్టు ఆదేశించింది. గతవారం ప్రజాభవన్ ఎదుట బారికేడ్లను ఢీకొన్న కేసులో సాహిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. సాహిల్ దుబాయి పారిపోయి ఉంటాడనే అనుమానంతో పోలీసులు లుక్‌అవుట్ నోటీసు జారీ చేశారు. ఈ కేసులో సాహిల్ స్నేహితులైన తమను విచారణ పేరుతో పోలీసులు వేధిస్తున్నారని సయ్యద్ జక్రియా రెహమాన్, మరో ముగ్గురు దాఖలు చేసిన పిటిషన్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. సీఆర్పీసీ నిబంధనలకు అనుగుణంగానే విచారణ ఉండాలని హైకోర్టు తేల్చి చెప్పింది. తదుపరి విచారణను వచ్చే నెల 29కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.

కండక్టర్ అత్యుత్సాహం

- ఒరిజినల్ ఆధార్ లేదని యువతిని దింపిన వైనం
- ఆర్టీసీ అధికారుల తీరుపై అమ్మాయి తండ్రి ఆగ్రహం
- డిపో మేనేజర్‌తో వాగ్వాదం.. కండక్టర్‌పై ఫిర్యాదు

వేములవాడ డిపోలో తన తండ్రితో యువతి

వేములవాడ రూరల్, డిసెంబర్ 30: ఒరిజినల్ ఆధార్ కార్డు లేదని బస్సులో ప్రయాణిస్తున్న యువతిని ఓ కండక్టర్ మధ్యలోనే దింపేసిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగింది. బాధితులవివరాల ప్రకారం.. వేములవాడకు చెందిన జాస్మిని హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నది. ఇటీవలే ఇంటికి వచ్చిన ఆమె.. హైదరాబాద్ వెళ్లేందుకు శనివారం మధ్యాహ్నం వేములవాడలో బస్సు ఎక్కింది. వేములవాడ పట్టణం దాటిన తర్వాత ఐదు కిలోమీటర్ల దూరంలో కండక్టర్ ఆ యువతిని ఆధార్‌కార్డు చూపించాలని అడగ్గా.. తన దగ్గర ఉన్న చిన్న ఆధార్‌కార్డును చూపించింది. ఒరిజినల్ ఆధార్‌కార్డు ఉండాల్సిందేనని, లేదంటే దిగిపోవాలంటూ మధ్యలోనే బస్సు ఆపి దింపేశాడు. దీంతో ఆ యువతి తండ్రి రాజిరెడ్డికి ఫోన్ చేయగా, వెంటనే ఆయన అక్కడికి చేరుకొని యువతితో కలిసి డిపోకు వెళ్లి డీఎంకు ఫిర్యాదు చేశారు. డీఎం మురళీకృష్ణ సైతం కండక్టర్‌కు వంతపాడుతూ ఒరిజినల్ ఉండాలని తమకు ఆదేశాలున్నాయని, తమ డ్యూటీ తాము చేస్తున్నామని యువతి తండ్రితో వాగ్వాదానికి దిగారు. కనీసం ఆడపిల్ల అని చూడకుండా మధ్యలోనే దింపివేయడం సరికాదని అక్కడ ఉన్న పలువురు ప్రయాణికులు సైతం డీఎంను నిలదీశారు. ఉచిత ప్రయాణమని చెప్పి ఇలా ఇబ్బంది పెట్టడంపై ఏంటని మండిపడ్డారు.

ఇరిగేషన్ సెక్రటరీ కావాలి!

- అదనపు బాధ్యతలకు దూరంగా స్మితా సబర్వాల్
- మరో అధికారి కోసం ప్రభుత్వం వెతుకులాట..
- నీటిపారుదల బాధ్యతల పట్ల అందరిలోనూ నిరాసక్తత

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సాగునీటి పారుదలశాఖకు సెక్రటరీ ఎవరు? ఆ శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రజత్‌కుమార్ నవంబర్ 30న ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో పంచాయతీరాజ్ సెక్రటరీగా ఉన్న స్మితాసబర్వాల్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించినా.. ఆమె ఆ విధులకు దూరంగా ఉంటున్నారు. అదనపు బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్మితా డిసెంబర్ 3 వరకు క్రియాశీలకంగా ఉన్నప్పటికీ, ఆ తరువాత ఆమె కార్యాలయానికి రావడం లేదు. సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన తొలి సమీక్షలోగానీ, ఇటీవల జరిపిన మేడిగడ్డ పర్యటనలో స్మిత కనిపించలేదు. సెలవు కూడా పెట్టలేదని సమాచారం. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ సెక్రటరీ ఎవరనే చర్చ జోరుగా కొనసాగుతున్నది.

ప్రభుత్వం ముమ్మర అన్వేషణ..

సాగునీటి పారుదలశాఖ కార్యదర్శి నియామకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ పలు ప్రాజెక్టుల రీడిజైన్, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం గురించి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సమర్థుడైన అధికారిని నియమించాలని కసరత్తు చేస్తున్నది. ఇందుకోసం కేంద్ర సర్వీసులో ఉన్న ఇద్దరు అధికారులను సంప్రదించినట్టు తెలిసింది. ఒకరు అనాసక్తి చూపగా, మరొకరు ఏడాది తరువాత వస్తానని చెప్పినట్టు ఇంజినీర్లు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సర్వీసులోని అధికారులను కూడా పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

ఇంజినీర్ల తర్జన భర్జన..

స్మితసభర్వాల్ దీర్ఘకాలంగా విధులకు దూరంగా ఉండటంతో ఫైళ్లు పేరుకుపోతున్నాయి. దీంతో ఇంజినీర్లు తలలు పట్టుకుంటున్నారు. ఉద్యోగులకు సంబంధించిన అనేక అంశాలు కూడా పెండింగ్‌లో పడిపోయాయి. కీలకాంశాలకు సంబంధించి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలంటే కార్యదర్శి ద్వారానే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. మేడిగడ్డ ఘటనకు సంబంధించి ఇంజినీర్లు తర్జనభర్జన పడుతున్నారు. కీలకమైన కృష్ణా ట్రిబ్యునల్ విచారణ వచ్చే నెలలో ప్రారంభం కానుంది. నాగార్జున సాగర్ డ్యామ్‌ను ఏపీ ఆక్రమంగా ఆక్రమించి స్వాధీనం చేసుకున్న వివాదం ఓవైపు నడుస్తున్నది. ఇక కేంద్ర సంస్థల నుంచి వచ్చే లేఖలకు సమాధానం ఇచ్చేవారు లేకుండాపోయారు. భూసేకరణ కోర్టు కేసులు, రోజువారీ ఫైళ్ల కదలికలు పూర్తిగా స్తంభించిపోయాయని అధికారులు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కార్యదర్శిని నియమించాలని కోరుతున్నారు.

త్వరలోనే వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు

- మహిళల ఉచిత ప్రయాణానికి అనూహ్య స్పందన
- ఆర్టీసీ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట
- త్వరలో పీఎఫ్, సీసీఎస్ బకాయిలు విడుదల చేస్తాం
- రవాణాశాఖ మంత్రి పొన్నం



కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఉచిత బస్సు ప్రయాణానికి మహిళల నుంచి అనూహ్య స్పందన వస్తున్నదని, పెరిగిన రద్దీకి అనుగుణంగా త్వరలోనే ఆర్టీసీకి వెయ్యి కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. పథకం ప్రవేశపెట్టిన 20 రోజుల్లోనే ఆరు కోట్ల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తూనే ఉద్యోగుల సంక్షేమం, సంస్థ పరిరక్షణకు పెద్దపీట వేస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, సీసీఎస్ బకాయిలను వీలైనంత త్వరగా విడుదల చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆర్టీసీకి కొత్తగా తీసుకొచ్చిన 80 ఎక్స్‌ప్రెస్, లహరి స్లీపర్ కమ్ సీటర్, రాజధాని ఏసీ బస్సులను శనివారం మంత్రి ప్రారంభించారు. జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైదరాబాద్ సీపీ శ్రీనివాసరెడ్డి, రవాణాశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌తో కలిసి పొన్నం ప్రభాకర్ బస్సులో కాసేపు ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తగా ప్రారంభించిన 80 బస్సుల్లో 50 బస్సులు శనివారం నుంచే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఏసీ, నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్, రాజధాని బస్సులు జనవరి చివరినాటికి, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు జూన్ చివరి నాటికి అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ... గతంలో 69 శాతం ఉన్న ఓఆర్ ప్రస్తుతం 88 శాతంగా నమోదవుతున్నదని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1,050 బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, వినోద్ కుమార్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయ పుష్ప, సీఎంఈ రఘునాథరావు, డీసీపీ సెంట్రల్ జోన్ శరత్‌చంద్ర పవార్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ అభివృద్ధికి ప్రత్యేక అథారిటీ

- ఎనిమిది మండలాలతో 'కాడా' ఏర్పాటు
- చైర్మన్‌గా వికారాబాద్ కలెక్టర్
- స్పెషల్ అధికారిగా నాగర్‌కర్నూల్ ఆర్డీవో కే వెంకట్‌రెడ్డి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- లోక్‌సభ ఎన్నికల తర్వాత కొడంగల్ రెవెన్యూ డివిజన్ ప్రకటన?

వికారాబాద్, డిసెంబర్ 30, (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఆ నియోజకవర్గాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో కలిపేందుకు ముమ్మర కసరత్తు జరుగుతుండగా.. తాజాగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా అథారిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాలను కలిపి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా)ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతోపాటు త్వరలో కొడంగల్‌ను రెవిన్యూ డివిజన్‌గానూ ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ ప్రక్రియను పూర్తి చేసి లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం కొడంగల్ రెవిన్యూ డివిజన్ ప్రకటన చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కాడా చైర్మన్‌గా వికారాబాద్ కలెక్టర్

వికారాబాద్ జిల్లాలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్ మండలాలను, నారాయణపేట జిల్లాలోని కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్ మండలాలను కలిపి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కాడా)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాడా చైర్మన్‌గా వికారాబాద్ కలెక్టర్ సీ నారాయణరెడ్డిని నియమించింది. స్పెషల్ అధికారిగా నాగర్‌కర్నూల్ ఆర్డీవో పనిచేస్తున్న కే వెంకట్‌రెడ్డిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. నియోజకవర్గ కేంద్రం కొడంగల్‌లో కాడా అథారిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. కాడా అథారిటీ కార్యాలయానికి అనువైన ప్రభుత్వ కార్యాలయాలను చూడాలని కొడంగల్ తాసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. కాడా అథారిటీకి స్పెషల్ అధికారితోపాటు ప్రత్యేకంగా ఒక తాసీల్దార్, డిప్యూటీ తాసీల్దార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లతో బృందాన్ని నియమించనున్నారు. మరోవైపు ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నోడల్ డిపార్ట్‌మెంట్‌గా వ్యవహరించనుంది. అవసరమైన పోస్టుల మంజూరు తోపాటు ఆర్థిక శాఖ సమన్వయంతో బడ్జెట్‌ను మంజూరు చేయనున్నారు.

కొడంగల్ సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

కాడా అథారిటీ స్పెషల్ అధికారితోపాటు వారి బృందం కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికను సిద్ధం చేయనున్నది. వారం రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికను రూపొందించే పనులు ప్రారంభంకానున్నాయి. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా ఏప్రిల్-మే నెలలోగా ప్రణాళికను సిద్ధం చేసేందుకు చర్యలు చేపట్టారు. కోడ్ ముగిసిన అనంతరం అభివృద్ధి పనులకు టెండర్లు ఆహ్వానించి, పనులు ప్రారంభించనున్నారు.

రెవెన్యూ డివిజన్‌గా..

కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో 10 జిల్లాల నుంచి 33 జిల్లాల ఏర్పాటు చేసిన దరిమిలా కొడంగల్ నియోజకవర్గం నారాయణపేట, వికారాబాద్ జిల్లాల పరిధుల్లోకి వచ్చింది. ఇదే క్రమంలో నియోజకవర్గంలోని కొన్ని మండలాలు వికారాబాద్ జిల్లా తాండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి రాగా, మరికొన్ని మండలాలు నారాయణపేట జిల్లా నారాయణపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వచ్చాయి. అయితే కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో సంకేతాలిచ్చినట్టు తెలిసింది. సీఎం ఆదేశంతో అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టనున్నది. లోక్‌సభ ఎన్నికల తర్వాత కొడంగల్ రెవెన్యూ డివిజన్ ప్రకటన ఉండే అవకాశమున్నది.

లీజుకు ఆర్టీసీ భూములు

- 13.16 ఎకరాలకు ఆన్‌లైన్ టెండర్లు
- జనవరి 18 వరకు అవకాశం

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): నిధుల సమీకరణ కోసం సంస్థ భూములను లీజుకు ఇవ్వాలని టీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. జీహెచ్ఎంసీ పరిధిలో సంస్థకు ఉన్న భూముల్లో 13.16 ఎకరాలు లీజుకు ఇచ్చేందుకు సిద్ధమైంది. కాచిగూడలో 4.14 ఎకరాలు, మేడ్చల్‌లో 2.83 ఎకరాలు, శామీర్‌పేటలో 3.26 ఎకరాలు, హకీంపేటలో 2.93 ఎకరాలు లీజుకు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో టెండర్ దరఖాస్తులను ఆహ్వానించింది. జనవరి 18 వరకు టెండర్లు దాఖలు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఆ మరుసటి రోజే టెండర్ ఫలితాలు ప్రకటిస్తామని స్పష్టం చేసింది. టెండర్ దక్కించుకున్న సంస్థ మాత్రమే లీజుతో అక్కడ వ్యాపార లావాదేవీలను నిర్వహించాలని, ముందస్తు అనుమతి లేకుండా సబ్ లీజుకు ఇవ్వడం కుదరదని నిబంధనల్లో సంస్థ పేర్కొన్నది. కనీసం రూ.100 కోట్ల టర్నోవర్ కలిగిన సంస్థలకు అవకాశం ఇవ్వాలని టీఎస్ ఆర్టీసీ భావిస్తున్నట్టు తెలిసింది. టెండర్ వివరాల కోసం https://www.tsrtc.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించింది.

మామూళ్ల మత్తులో ఆబ్కారీ

- అధికారుల నుంచి సిబ్బంది వరకు వసూళ్లు
- పదాదికి ఒక్కో షాపు నుంచి రూ.5 లక్షల వరకు వసూలు
- లబోదిబోమంటున్న వ్యాపారులు

హైదరాబాద్ సిటీబ్యూరో/నిజామాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఆబ్కారీశాఖ మామూళ్ల మత్తులో జోగుతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్‌శాఖలోని పలువురు అధికారులు, సిబ్బంది హోదాకు తగ్గట్టుగా వసూళ్లకు పాల్పడుతున్నారని మద్యంషాపుల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతున్నది. రూ.కోట్లు వెచ్చించి న్యాయంగా దుకాణాలు దక్కించుకున్నా అధికారుల నుంచి మామూళ్ల వేధింపులు తప్పట్లేదని వాపోతున్నారు.

ఫుల్, హాఫ్, క్వార్టర్ పేర్లతో వసూళ్లు

ఫుల్ బాటిల్, హాఫ్, క్వార్టర్ రూపంలో మద్యాన్ని విక్రయించినట్టుగానే అవే పేర్లతో అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఫుల్ అంటే.. ఏడాదికి రూ.2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేయాలంటూ రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతున్నట్టు తెలుస్తున్న ది. వార్షిక మామూళ్లకు అదనంగా హాఫ్, క్వార్టర్ పేరుతో స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు రూ.30 వేలు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. ఇవి కాకుండా స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు అదనంగా నెలవారీ చెల్లింపులు చేసుకోవాలని చెప్తున్నారు. వీరు నెలకు రూ.20 వేల నుంచి రూ. 30 వేల వరకు వసూలు చేయడంతో పాటు పండుగ వేళల్లో మద్యం బాటిళ్లు డిమాండ్ చేస్తుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిగినంత ముట్టజెప్పకుంటే లేనిపోని సాకులు చూపుతూ కేసులు నమోదు చేస్తారని ఆరోపిస్తున్నారు.

పైసా రాకుండానే పంపకాలు

ఉమ్మడి నిజామాబాద్‌లో మద్యం వ్యాపారుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 142 వైన్‌షాపులున్నాయి. ప్రతి దుకాణం నుంచి గుడ్‌విల్ పేరుతో టార్గెట్లు పెట్టి మరీ ఆబ్కారీ అధికారులు వసూలు చేస్తున్నారని వ్యాపారు లు చెప్తున్నారు. పైసా కూడా లాభం కళ్లజూడకముందే ఇదేం ఖర్మరా బాబూ అంటూ కొత్త గా ఈ వ్యాపారంలోకి వచ్చినవారు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి మరీ వసూళ్లకు తెగబడుతున్నట్టు సమాచారం.

ఎక్సైజ్ ట్యాక్స్‌లోనే పర్మిట్ ఫీజు

గతంలో కొన్ని దుకాణాలకే ప్రభుత్వం పర్మిట్ రూములకు అనుమతినిచ్చింది. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు ఎక్సైజ్ అధికారులు పర్మిట్ రూముల పేరిట అక్రమాలకు పాల్పడడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎక్సైజ్ ట్యాక్స్‌లోనే పర్మిట్ ఫీజును కూడా కలిపేశారు. మద్యం దుకాణాలకు ఏయే ప్రాంతాల్లో పర్మిట్ రూములు ఉండాలన్న దానిపై మార్గదర్శకాలు జారీ చేసింది. మరోవైపు, లిక్కర్ వ్యాపారంలో బడా వ్యాపారవేత్తల పెత్తనానికి చెక్‌పెట్టి అందరికీ అవకాశం కల్పించేందుకు లాటరీ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.

బోయిన్‌పల్లి అనురాధ టింబర్ ఎస్టేట్ నిర్వాహకులను సన్మానిస్తున్న గవర్నర్ తమిళిసై

రాజీనామా వార్తలు అవాస్తవం

- గవర్నర్ తమిళిసై స్పష్టీకరణ
- బోయిన్‌పల్లి అనురాధ టింబర్ డిపో సేవలు వెలకట్టలేనివి
- రామాలయ తలుపులను పరిశీలించిన గవర్నర్

కంటోన్మెంట్, డిసెంబర్ 30: తాను రాజీనామా చేసున్నట్టు వస్తున్న వార్తలు అవాస్తవమని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ స్పష్టం చేశారు. నిరాధార వార్తలను ప్రచారం చేయొద్దని కోరారు. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ మళ్లీ పొలిటికల్ ఎంట్రీ ఇస్తున్నారనే వార్తలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తమిళిసై ఢిల్లీ పర్యటన నేపథ్యంలో అవి మరింత వైరల్‌గా మారాయి. కాగా, శనివారం బోయిన్‌పల్లి అనురాధ టింబర్ ఎస్టేట్‌ను పర్యటించిన సం దర్భంగా గవర్నర్ తన రాజీనామాపై వస్తున్న వార్తలను ఖండించారు. టింబర్ డిపోలో తయారవుతున్న అయోధ్య రామాలయం ద్వారాలు, శిల్పాలను తిలకించారు. అయోధ్య రామాలయానికి తెలంగాణలో ద్వారాలను తయారు చేయడం అభినందనీయమన్నారు. టింబర్ ఎస్టేట్ అధినేతలు చదలవాడ శరత్‌బాబు, కిరణ్, ద్వారాల శిల్పి రమేశ్‌కుమార్‌ను గవర్నర్ అభినందించారు.

పదేండ్ల బాలికకు ఫుల్ టికెట్

వనపర్తి, డిసెంబర్ 30: బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో కొందరు కండక్టర్లు ఇష్టారీతిన టికెట్లు కొడుతున్నారు. శనివారం పెబ్బేరు నుంచి వనపర్తికి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సులో పదేండ్ల చిన్నారికి కండక్టర్ ఫుల్ టికెట్ ఇచ్చాడు. ఫుల్ టికెట్ ఎందుకిచ్చారని ఆమె సోదరుడు ప్రశ్నిస్తే.. 'రాష్ట్రంలో ఎవరికి లేని బాధ నీకేందుకు' అంటూ దురుసుగా మాట్లాడినట్టు ఆ యువకుడు తెలిపాడు.

భర్తపై వేడి నీళ్లు పోసిన భార్య

తొర్రూరు, డిసెంబర్ 30: కుటుంబ కలహాలతో ఓ మహిళ తన భర్తపై వేడి నీళ్లు పోసి గాయపర్చింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కొమ్మనపల్లికి చెందిన యాకూబ్-సరోజ దంపతుల మధ్య నాలుగేండ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు ఇవ్వాలని సరోజ శుక్రవారం యాకూబ్‌ను అడగ్గా, నిరాకరించాడు.ఈ క్రమంలో కూలికి వెళ్లి వచ్చి స్నానానికి పెట్టుకున్న వేడినీళ్లను భర్తపై పోసింది. ఘటనపై తొర్రూరు పీఎస్‌లో కేసు నమోదైంది.

తెలంగాణ బిడ్డకు సీబీఈ అవార్డు

- డాక్టర్ కన్నెగంటి చంద్ర సేవలకు బ్రిటన్‌లో అరుదైన గౌరవం
- తెలుగు రాష్ట్రాల నుంచి అందుకున్న తొలి వ్యక్తిగా రికార్డు
- భారత్‌లో పద్మ అవార్డులతో సమానం

డాక్టర్ కన్నెగంటి చంద్ర

నిజామాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బ్రిటన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీబీఈ (కమాండర్ ఆఫ్ ది మోస్ట్ ఎక్స్‌లెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్) అవార్డు తెలంగాణ బిడ్డకు దక్కింది. బ్రిటీష్‌లో 2024కి ఇవ్వనున్న అవార్డులకు డిసెంబర్ 29న ప్రచురితమైన ఆనర్స్ లిస్ట్‌లో 15 కామన్‌వెల్త్ దేశాలకు